క్లుప్తంగా

పంట పొలాల పరిశీలన

కొండపాటూరు(కాకుమాను): రాష్ట్రంలో పాలకులు మారిన రైతుల కష్టాలు మాత్రం తీరడం లేదని రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కొత్త వెంకటశివరావు అన్నారు. మండలంలోని కొండపాటూరులో నల్లమడ వాగును శుక్రవారం పరిశీలించారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు నల్లమోతు రాజేంద్ర, పి.రామకృష్ణ, పి.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

10న గ్రామపంచాయతీ కార్మికుల రాష్ట్ర సదస్సు



పెదకాకాని: గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యల పరిష్కారం కోరుతూ ఈనెల 10న రాష్ట్ర సదస్సు నిర్వహించనున్నట్లు సీఐటీయూ జిల్లా కార్యదర్శి నన్నపనేని శివాజీ అన్నారు. పెదకాకాని పంచాయతీ కార్యాలయం వద్ద శుక్రవారం ఏపీ గ్రామపంచాయతీ ఎంప్లాయీస్ వర్కర్స్ యూనియన్ సమావేశం పి.ఆదిలక్ష్మి అధ్యక్షతన శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా శివాజీ మాట్లాడుతూ గుంటూరు సీఐటీయూ కార్యాలయంలో నిర్వహించనున్న సదస్సుకు ముఖ్యఅతిథిగా శాసన మండలి సభ్యులు కేఎస్ లక్ష్మణరావు, రాజధాని ఎమ్మెల్యే శ్రావణ్ కుమార్, ప్రత్తిపాడు ఎమ్మెల్యే రామాంజనేయులు హాజరు అవుతారని గ్రామపంచాయతీల స్థితిగతులపై చర్చిస్తారని తెలిపారు.

ద్రవజీవామృతం తయారీపై శిక్షణ

గుంటూరు రూరల్: రైతు సేవ కేంద్రంలో వాతావరణ పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని జిల్లా డీపీఎం రాజకుమారి ఆదేశాల మేరకు ద్రవ జీవామృతం తయారీపై శిక్షణ ఇస్తున్నట్లు సేంద్రియ వ్యవసాయం మెంటర్ కె.గురవయ్య తెలిపారు. శుక్రవారం మండలంలోని వెంగళాయపాలెం గ్రామంలో డ్వాక్రా సంఘాల మహిళలు, రైతులకు సామూహిక ద్రవ జీవామృతం తయారీ కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో రైతులకు మాస్టర్ ట్రైనర్ జి. నాగరాజు ద్రవ జీవామృతం తయారీ విధానంకి అవసరమైన పదార్థాలు వివరించి చేసి చూపించారు.

కాంట్రాక్టు స్టాఫ్‌నర్సుల నిరసన

గుంటూరు మెడికల్: గుంటూరు జీజీహెచ్‌లో పనిచేస్తున్న కాంట్రాక్టు స్టాఫ్ నర్సులు నల్లబ్యాడ్జిలు ధరించి శుక్రవారం విధులు బహిష్కరించారు. సర్దుబాటు కోసం విడుదల చేసిన జీఓ నంబరు 115 నిలుపుదల చేయాలని డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్ నర్సెస్ స్ట్రగుల్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో నాయకులు మాట్లాడారు. నర్సెస్ స్ట్రగుల్ కమిటీ నేతలు స్వచ్ఛంద ప్రసాద్, పి.మనీష, బి.శివమ్మ, వి.విజయ్‌కుమార్, హైమావతి, కుసుమకుమారి, కరుణ పాల్గొన్నారు. నాట్కో క్యాన్సర్‌సెంటర్‌లోని నర్సింగ్ కార్యాలయం అధికారులు తమను బెదిరించినట్లు కాంట్రాక్టు నర్సింగ్ సిబ్బంది వాపోయారు.

ఐక్యవేదిక మద్దతు..

గుంటూరు జీజీహెచ్‌లో కాంట్రాక్టు స్టాఫ్ నర్సులు చేస్తున్న ఆందోళనకు జిల్లా ఐక్యవేదిక నేతలు మద్దతు తెలిపింది. ఐక్యవేదిక జిల్లా చైర్మన్ చాంద్ బాషా, పలువురు నేతలు జీజీహెచ్‌కు విచ్చేసి కాంట్రాక్టు స్టాఫ్‌నర్సులతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి శివారెడ్డి, నగరశాఖ అధ్యక్షుడు వై.నాగేశ్వరరావు, జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి కరిముల్లాషాఖాదిరి, జిల్లా మహిళా అధ్యక్షురాలు హేమలత, సంయుక్త కార్యదర్శి షబానా సుల్తానా, అరుణకుమారి, విజ యబాబు, రత్తయ్య, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

నాణ్యతా ప్రమాణాలు పాటించాలి

గుంటూరు ఎడ్యుకేషన్: ప్రభుత్వ పాఠశాలల్లో అమలు చేస్తున్న మధ్యాహ్న భోజనంలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని 25వ డివిజన్ కార్పొరేటర్ చంద్రగిరి కరుణకుమారి పేర్కొన్నారు. శుక్రవారం జోసఫ్‌నగర్‌లోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన కార్యక్రమాన్ని పరిశీలించారు. విద్యార్థులకు స్వయంగా ఆహారాన్ని వడ్డించారు.

అసోం, నాగాలాండ్‌లో డాక్టర్ నిశాంత్ వైద్య సేవలు



గుంటూరు మెడికల్: గుంటూరుకు చెందిన ప్రఖ్యాత ప్లాస్టిక్, కాస్మోటిక్ సర్జన్ డాక్టర్ నిశాంత్ సాధనాల గిరిజన ప్రాంతాల్లో ప్రజలకు ఉచిత వైద్య సేవలు అందించారు. సెప్టెంబరు మొదటి వారంలో అసోం – నాగాలాండ్ సరిహద్దులోని 15 మంది చిన్నారులకు రోగులకు ఉచిత శస్త్రచికిత్సలు విజయవంతంగా చేశారు. సేవా యాత్ర ముగించుకుని శుక్రవారం గుంటూరు వచ్చిన డాక్టర్ నిశాంత్ సాధనాల మీడియాతో మాట్లాడారు. గ్రహణం మొర్రి, చీలిక పెదవి సమస్యలతో బాధపడుతున్న పిల్లలు, కాలిన గాయాల కారణంగా వికృత రూపాలకు గురైన గిరిజన ప్రాంత బాధితులకు ఉచితంగా శస్త్రచికిత్సలు చేశామన్నారు. జీవన రేఖ ఎక్స్‌ప్రెస్‌లో పనిచేయడం చాలా ఆనందంగా ఉందన్నారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ 'జీవన రేఖ ఎక్స్‌ప్రెస్' వంటి పథకాల ద్వారా వీరికి చక్కని వైద్య సేవలు అందిస్తున్నామని చెప్పారు.

అంతటా గణేశ్ ఉత్సవ సందడి

- విక్రయానికి సిద్ధంగా వినాయక విగ్రహాలు
- నేటి నుంచి ఉత్సవాలకు సిద్ధమవుతున్న మండపాలు



విక్రయానికి సిద్ధంగా ఉన్న వినాయక విగ్రహాలు

పొన్నూరు: పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో వినాయక చవితి సందడి మొదలైంది. ఒడిశా, రాజస్థాన్ తదితర ప్రాంతాల నుంచి వచ్చిన కార్మికులు పట్టణంలో పలు ప్రాంతాల్లో గుడారాలు వేసుకొని రెండునెలల ముందే పట్టణంలో విగ్రహాల తయారీ చేపట్టి విక్రయాలకు సిద్ధం చేశారు. భక్తులతో తొలి పూజలు అందుకుని విఘ్నాలను తొలగించే అధినాయకుడు మహాగణపతి నవరాత్రుల ఉత్సవాలు శనివారం ప్రారంభం కానుండడంతో పొన్నూరు పరిధిలో మండపాలు సిద్ధమయ్యాయి. ప్రధాన రహదారులు, వీధుల్లో గణనాథులను ప్రతిష్ఠించేందుకు వీలుగా మండపాల నిర్మాణం తుదిదశకు చేరింది. ఇప్పటికే నిర్వాహకులు భారీ వినాయక ప్రతిమలను తెచ్చి మండపాల్లో ప్రతిష్ఠిస్తున్నారు. వాటిని వివిధ రంగుల వస్త్రాలంకరణతో తీర్చిదిద్దే పనులను కొనసాగిస్తున్నారు. పొన్నూరు పట్టణం, చుట్టు పక్కల గ్రామాల నుంచే కాకుండా వేరే ప్రాంతాల నుంచి ఉత్సవ నిర్వాహకులు విగ్రహాలు తీసుకువెళుతున్నారని విగ్రహాల విక్రయదారులు చెబుతున్నారు. నవరాత్రి ఉత్సవాలు శాంతియుత వాతావరణంలో కొనసాగేలా పట్టణ, రూరల్ పోలీసులు మండపాల నిర్వాహకులతో ప్రత్యేక సమావేశాలు నిర్వహిస్తున్నారు.

తరలుతున్న గణనాథులు

పెదకాకాని: వినాయక చవితి పూజలందుకునేందుకు శుక్రవారం గణనాథులు పందిళ్లకు తరలి వెళుతున్నారు. పెదకాకాని మండలంలోని పోలీసుస్టేషన్, వరలక్ష్మి అమ్మవారి ఆలయం, గడ్డిపాడు, నంబూరు అడ్డరోడ్డు సమీపంలో పెద్ద ఎత్తున వినాయక విగ్రహాలు ఏర్పాటు చేసి అమ్మకాలు చేపట్టారు. భక్తులు ఆయా ప్రాంతాలకు చేరుకుని విగ్రహాలు కొనుగోలు చేసి ట్రాక్టర్లు, ఆటోలు, లారీల్లోనూ తమ గ్రామాలకు తరలిస్తున్నారు. మండలంలోని ఆయా గ్రామాల్లో ఇప్పటికే వినాయక చవితి వేడుకలు నిర్వహించేందుకు పెద్ద ఎత్తున పందిళ్ళు ఏర్పాటు చేశారు. పలు కమిటీలు, యూత్‌ల ఆధ్వర్యంలో వినాయక చవితి వేడుకలు జరుపుకునేందుకు పందిళ్లను ఏర్పాటు చేసి విద్యుత్ కాంతులతో అలంకరించారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల నుంచి గుంటూరు నగరంలో పత్రి అమ్ముకునే వారు కూడా గ్రామ శివార్లకు చేరుకుని విఘ్నేశ్వరునికి ఇష్టమైన పత్రికను సేకరించి నగరానికి తరలించే పనుల్లో నిమగ్నమయ్యారు.

వినాయక చవితి ఉత్సవాలకు సిద్ధం

పొన్నూరు: వినాయక చవితి పండుగ పురస్కరించుకుని శనివారం నిర్వహించుకునేందుకు పొన్నూరు ప్రజలు సర్వం సిద్ధం చేశారు. ఉత్సవ నిర్వాహకులు మండపాలను విశేషంగా అలంకరించి ఉత్సవాలను వైభవంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశారు. పట్టణ పరిసరాల్లోని వినాయక విగ్రహ విక్రయ కేంద్రాల నుంచి భారీ విగ్రహాలను మండపాలకు తరలించి ప్రత్యేక పూజలకు సిద్ధం చేశారు. పండుగ నేపథ్యంలో పూజా సామాగ్రి కొనుగోళ్లతో మార్కెట్లు కిటకిటలాడాయి. పలు స్వచ్ఛంద సంస్థలు ఉచితంగా వినాయక మట్టి ప్రతిమలు పంపిణీ చేశారు.

పర్యావరణ పరిరక్షణే లక్ష్యంగా..

పర్యావరణ పరిరక్షణే లక్ష్యంగా పట్టణంలోని ఐలాండ్ సెంటర్‌లో శుక్రవారం వినాయక మట్టి ప్రతిమల పంపిణీ చేశారు. మన పొన్నూరు బ్లడ్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ముప్పాల రమేష్‌బాబు ముఖ్య అతిథిగా పాల్గొని మట్టి వినాయక ప్రతిమలు, పుస్తకాలను ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో జాగర్లమూడి సుధీర్, కర్ర మహేష్, చల్లపల్లి సోమరాజు, సంస్థ వ్యవస్థాపకులు టి. ఉమాశంకర్, సభ్యులు భాస్కర్, గోపి, రామకృష్ణ, శ్రీను, విజయ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

– రోటరీక్లబ్ ఆఫ్ పొన్నూరు ఆధ్వర్యంలో..

రోటరీక్లబ్ ఆఫ్ పొన్నూరు అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్. రవి రాకేష్ దేవ్, ఎన్.బాలకృష్ణ ఆధ్వర్యంలో సభ్యుల సహకారంతో ఐలాండ్ సెంటర్‌లో వినాయక మట్టి ప్రతిమలు, పుస్తకాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో శివరామకృష్ణ, రాజేంద్రచౌదరి, కుద్దూస్, రామారావు, రాధాకృష్ణ పాల్గొన్నారు.



వినాయక మట్టి ప్రతిమలు అందిస్తున్న కమిషనర్ రమేష్‌బాబు



వినాయక మట్టి ప్రతిమలు అందిస్తున్న రోటరీ సభ్యులు



పెదకాకాని వై జంక్షన్ నుంచి మండపాలకు గణనాథులను తరలిస్తున్న భక్తులు



సిద్ధమవుతున్న మండపం





పొన్నూరులో పూజాసామాగ్రి కొనుగోళ్ల సందడి

గోసంరక్షణకు తగిన చర్యలు తీసుకుంటాం

- నగర మేయర్ కావటి మనోహర్‌నాయుడు
- వెంగళాయపాలెంలోని గోసంరక్షణ కేంద్రం పరిశీలన



అధికారులతో మాట్లాడుతున్న మేయర్

గుంటూరు రూరల్: వెంగళాయపాలెంలోని నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గో సంరక్షణశాలను నగర మేయర్ కావటి మనోహర్‌నాయుడు శుక్రవార ఆకస్మిక తనిఖీ చేశారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాల కారణంగా గోవులు తీవ్ర ఇబ్బంది పడుతున్నాయని, వాటికి ఆహారం కూడా సరిగా అందటంలేదని ఫిర్యాదులు అందుతున్న నేపథ్యంలో గో సంరక్షణ, గో ప్రేమికులు, నగరపాలక సంస్థ అధికారులతో కలసి మేయర్ పరిశీలించారు. గో ప్రేమికులతో చర్చించి, తీసుకోవాల్సిన చర్యలపై అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ గోవులు ఇబ్బంది పడుతున్నప్పటికీ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడంపై అధికారులు సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్షణమే గోశాలను రోబో యంత్రంతో శుభ్రం చేయించాలని ప్రజారోగ్య అధికారులను ఆదేశించారు. గోవులను వివిధ ప్రాంతాల నుంచి వేరొక ప్రాంతాలకు అనధికారికంగా తరలిస్తున్న వాహనాలను గోసంరక్షణ సభ్యులు పోలీసులు పట్టుకుని, వాటిలో ఉన్న గోవులను నగరపాలకసంస్థ గోసంరక్షణకు తరలించుట వలన గోవుల సంఖ్య పెరిగాయన్నారు. నగర పాలక సంస్థ అధికారులు గోవుల సంరక్షణలో నిర్లక్ష్యం వహించడం తగదని హితవుపలికారు. గోవుల సంఖ్య ఎక్కువగా ఉండుటంవల్ల గో సంరక్షణశాల చుట్టుపక్కల ఖాళీ స్థలంలో ఫెన్సింగ్ వేసి వాటిని బయటకి వదలాలన్నారు. గో సంరక్షకులుగాని, గోవులను పెంచుకోదలచుకున్న వారికి నిబంధనల ప్రకారం గోవులను అందజేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో గో సంరక్షణ ప్రేమికులు సిహెచ్.రాజు, ఆర్.కోటేశ్వరరావు, జి.మనోహర్, ఎస్. మనోహర్ పాల్గొన్నారు.

నీటిని వెంటనే బయటకు పంపాలి



కొల్లిమర్లలో వరి పైరును పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి నున్న వెంకటేశ్వర్లు

కొల్లిమర్ల(కాకుమాను): ఇటీవల కురిసిన భారీ వర్షాలకు మునిగిన పంట పొలాల్లో నీటిని సాధ్యమైనంత త్వరగా బయటకు పంపించాలని జిల్లా వ్యవసాయశాఖ అధికారి నున్న వెంకటేశ్వర్లు సూచించారు. మండలంలోని కొల్లిమర్ల, కేబీ పాలెం గ్రామాలలో నీట మునిగిన వరి పంటలను శుక్రవారం పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతానికి వర్షాల కారణంగా వరి పంటకు నష్టం వాటిల్లే అవకాశాలు లేవని ఆయన తెలిపారు. నాలుగు నుంచి ఐదు రోజుల వరకు పొలంలో నీరు నిల్వ ఉన్న తట్టుకునే శక్తి వరికి ఉందని చెప్పారు. +సాధ్యమైనంత త్వరగా వర్షం నీటిని బయటకు పంపి ఎకరాకు 30 కిలోల యూరియా, 15 కిలోల ఎంటీపీ పంటపై పిచికారి చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పొన్నూరు ఏడీఏ రామకోటేశ్వరి, ఏఓ కె.కిరణ్మయి పాల్గొన్నారు.

బజరంగ్ ఆధ్వర్యంలో ఏడు వేల మట్టి ప్రతిమల పంపిణీ



మట్టి వినాయకుడి ప్రతిమలను పంపిణీ చేస్తున్న బజరంగ్ అర్బన్ ఇన్‌ఫ్రా సీఈఓ అంబటి మురళీకృష్ణ

కొరిటెపాడు: మట్టి వినాయకుడిని పూజించి ప్లాస్టిక్ రహిత సమాజ నిర్మాణానికి ముందడుగు వేద్దామని బజరంగ్ అర్బన్ ఇన్‌ఫ్రా సి.ఈ.ఓ. అంబటి మురళీకృష్ణ పిలుపునిచ్చారు. మట్టి వినాయకుడిని పూజిద్దాం అనే నినాదంతో బజరంగ్ అర్బన్ ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం మట్టి గణపతి ప్రతిమల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. గుంటూరు నగరం పట్టాభిపురంలో ఆరు వేలు ప్రతిమలు, పొన్నూరు మండలం మామిళ్లపల్లి గ్రామంలో వెయ్యి ప్రతిమలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బజరంగ్ సి.ఈ.ఓ. అంబటి మురళీకృష్ణ మాట్లాడుతూ వినాయక చవితి పర్వదినానికి ప్రకృతికి అవినాభావ సంబంధం ఉందని, దాన్ని మన పూర్వీకులు వేల సంవత్సరాల క్రితమే ఆచారంగా అందించారని తెలిపారు. ప్రజలంతా మట్టి గణపతి ప్రతిమను పూజించడం ద్వారా పండుగ మరింత శోభాయమానంగా విరాజిల్లుతుందని చెప్పారు. మూ డేళ్లుగా మట్టి గణపతి ప్రతిమలను పంపిణీ చేస్తున్నా మని వెల్లడించారు. కార్యక్రమంలో బజరంగ్ డైరెక్టర్లు సిద్దినేని శ్రీనివాసరావు, సమీర్ నందన్, జి.సుబ్బారా వు, ప్రాజెక్టు మేనేజర్ సుధాకర్ రెడ్డి పాల్గొన్నారు.

స్మార్ట్ ఐడియా ఛాలెంజ్–2024 పోటీలు



విజేతలతో కళాశాల యాజమాన్యం

గుంటూరు రూరల్: కేంద్ర ప్రభుత్వ విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించనున్న స్మార్ట్ ఇండియా హాక్ థాన్ – 2024 పోటీలలో పాల్గొనేందుకు తమ కళాశాల విద్యార్థులు సిద్ధంగా ఉన్నారని ఆర్‌వీఆర్ జేసీ ఇంజినీరింగ్ కళాశాల అధ్యక్షుడు డాక్టర్ ఆర్.శ్రీనివాస్, ఉపాధ్యక్షులు జాగర్లమూడి మురళీమోహన్, డాక్టర్ జగదీష్ మద్దినేని తెలిపారు. శుక్రవారం చౌడవరంలోని కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో వివరాలు వెల్లడించారు. స్మార్ట్ ఇండియా హాక్ థాన్– 2024 పోటీల్లో విద్యార్థులను భాగస్వాములను చేసేందుకు కళాశాల, స్టెప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్మార్ట్ ఐడియా ఛాలెంజ్ 2024 పేరుతో పోటీలు నిర్వహించారు. పోటీల్లో 8 జట్లు ఫైనల్స్‌కి చేరగా ఉత్తమ ప్రతిభ కనబరిచిన 3 జట్లను ఎంపికచేసి ప్రోత్సాహక నగదు బహుమతులను, సర్టిఫికెట్ మెమొంటోలను అందజేశారు. నూతన ఆవిష్కరణలకు, అంకుర పరిశ్రమల స్థాపనకు వినూత్న ఆలోచనలే తొలి ప్రధాన మార్గమని కళాశాల సెక్రటరీ కరెస్పాండెంట్ ఆర్.గోపాలకృష్ణ, ట్రజరర్ డాక్టర్ కె.కృష్ణప్రసాద్ పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ కె.శ్రీనివాస్, డైరెక్టర్ కె.రవీంద్ర, ఏఓ డైరెక్టర్ ఎన్వీ శ్రీనివాసరావు, ఎంవీపీ చంద్రశేఖర్, మహేంద్రవర్మ, కె.కార్తీకపవన్, ఎస్.రాధిక, కె.శోభ తదితరులున్నారు.

నల్లమడకు శాశ్వత పరిష్కారం చూపాలి

ఎమ్మెల్యేను కోరిన నల్లమడ రైతు సంఘ నాయకులు



ఎమ్మెల్యే రామాంజనేయులతో మాట్లాడుతున్న కొల్లా రాజమోహనరావు

కొండపాటూరు(కాకుమాను): నల్లమడ వాగుకు శాశ్వత పరిష్కారం చూపించలని నల్లమడ రైతు సంఘం నాయకులు కొల్లా రాజమోహనరావు కోరారు. మండలంలోని కొండపాటూరు వద్ద ఉన్న నల్లమడ వాగు ఇటీవల కురిసిన భారీ వర్షాలకు గండి పడడంతో నీట మునిగిన పంట పొలాలను శుక్రవారం ఎమ్మెల్యే రామాంజనేయులు పరిశీలించారు. ఎమ్మెల్యే వస్తున్న విషయం తెలుసుకున్న రాజమోహనరావు నల్లమడ వాగు వద్దకు చేరుకుని వర్షాల కారణంగా రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందుల గురించి వివరించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే రామాంజనేయులు మాట్లాడుతూ యుద్ధప్రాతిపదికన నల్లమడ వాగు అభివృద్ధి పనులు చేపడతామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో యార్లగడ్డ అంకమ్మ చౌదరి, చుండూరు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మట్టి ప్రతిమలతో పర్యావరణ పరిరక్షణ



మట్టి వినాయక ప్రతిమలను అందజేస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ చంద్రశేఖర్

గుంటూరు రూరల్: మట్టి వినాయక ప్రతిమలను పూజించి పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషిచేయాలని చలపతి ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.చంద్రశేఖర్ తెలిపారు. శుక్రవారం కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో నగరంలోని పట్టాభిపురం, బృందావన్‌గార్డెన్స్, తదితర ప్రాంతాల్లో ప్రజలకు మట్టి వినాయక ప్రతిమలను అందించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు డాక్టర్ ఎ.బాలాజీ, నాగగోపి, కె.వెంకటరావు, పి.వెంకటనరేంద్ర, పి.రాధాకృష్ణమూర్తి, జె.లక్ష్మీనారాయణ, డి.తిరుపతి, డాక్టర్ ఆర్.శ్రీనివాసులు పాల్గొన్నారు.

వరద బాధితులను ఆదుకోవాలి

లక్ష్మీపురం: వరదలకు నష్టపోయిన నష్టపరిహారం అందజేసి ఆదుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు డిమాండ్ చేశారు. స్థానిక బ్రాడీపేటలోని పార్టీ జిల్లా కార్యాలయంలో శుక్రవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలో సుమారు లక్ష ఎకరాలలో పంటలు దెబ్బతిన్నాయని చెప్పారు. ఉద్యాన పంటలకు ఎకరాకు లక్ష రూపాయలు, వరి పంటకు ఎకరాకు రూ.30 వేలు నష్టపరిహారం ఇవ్వాలని కోరారు.

చెరువులు కాదు... పంట పొలాలే..!



నంబూరు శివార్లలోని మురుగుకాలువ వద్ద గండి పూడ్చే పనుల్లో అన్నదాతలు



పొలంలో నీరు బయటకు వెళ్ళకపోవడంతో కుళ్ళిపోతున్న వరిపైరు



నంబూరు శివారులో చెరువులను తలపిస్తున్న పంట పొలాలు

పెదకాకాని: వరద నీరు ప్రభావంతో పంట కాలువలకు గండ్లు పడి వరి పొలాలు చెరువులను తలపిస్తున్నాయి. పంట పొలాల్లోకి చేరిన వరద నీటిలో ఆరు రోజులుగా వరిపైరు మునిగిపోయి ఉండటంతో పాచిపట్టి కుళ్లిపోతుందని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నంబూరు నుంచి పెనుమూలి వెళ్లే రోడ్డులో ఉన్న మురుగు కాలువలకు గండి పడటంతో నీరు ఉధృతంగా ప్రవహిస్తూ ఇప్పటికీ పంట పొలాల్లోకి చేరుతూనే ఉంది. కాలువకు తూర్పు వైపున పడిన గండిని పూడ్చే పనుల్లో పెనుమూలి రైతులు నిమగ్నమయ్యారు. కాలువ కట్టలపై ట్రాక్టర్లతో మట్టి, కంకరరాళ్ల మూటలను తరలించి గండికి అడ్డుగా వేస్తున్నారు. మురుగుకాలువకు పడమర వైపున పడిన గండి పూడ్చడానికి మరో రెండు రోజుల పాటు ట్రాక్టర్లు వెళ్లడానికి వీలు లేకుండా ఉంది. శుక్రవారం వాతావరణంలో మార్పులు చోటు చేసుకుని అధిక వర్షం పడటంతో మరింత పరిమాణంలో వరద నీరు పొలాలకు చేరుతుంది. మండలంలోని గోళ్లమూడి, ఉప్పలపాడు, వెంకటకృష్ణాపురం, తంగెళ్ళమూడి గ్రామ శివార్లలో వరిపొలాల్లోకి చేరిన నీరు చెరువుల మాదిరిగానే కనిపిస్తున్నాయి. మండలంలోని ఏడు వేల ఎకరాల్లో వరి పైరు, 150 ఎకరాల్లో ప్రత్తి, 80 ఎకరాలు మినుము దెబ్బతిన్నట్లు వ్యవసాయ అధికారులు ప్రాథమిక అంచనా వేయడం జరిగిందని ఏఓ పి.సంధ్యారాణి తెలిపారు.